


అనారోగ్యంతో కానిస్టేబుల్ మృతి

ప్రజాశక్తి - సీతంపేట



స్థానిక పోలీస్ స్టేషన్లో విధులు నిర్వహిస్తున్న పాడి బాబురావు (45) శుక్రవారం అనారోగ్యంతో మృతి చెందారు. పాలకొండ పట్టణం నక్కలపేటలో గల తన స్వగృహంలో తుది శ్వాస విడిచారు. బాబూరావు మృతి పట్ల పాలకొండ డిఎస్పి రాంబాబు, సిఐ ప్రసాదరావు, ఎస్ఐ వై.అమ్మనరావు, ప్రయోగమూర్తి, పోలీస్ సిబ్బంది, ఇంటిలిజెన్స్ స్పెషల్ బ్రాంచ్ తోటి సిబ్బంది సంతాపం తెలిపారు.

కౌలురైతుల అవస్థలు



- ఖరీఫ్ చివర్లోనూ అందని గుర్తింపు కార్డు
- కౌలు చట్టంపై దొంగాట

ప్రజాశక్తి - కొమరాడ

ప్రజలకు కడుపునిండా అన్నం పెడుతున్న రైతన్నల కడుపులు మాత్రం నిండడం లేదు. అన్ని వర్గాల ప్రజలు ఒక్కొక్క అడుగు అభివృద్ధి చెందుతుంటే రైతన్నలు మాత్రం రోజురోజుకు వెనుకబడిపోయి సాగు చేయకలేక దయనీయ పరిస్థితులు ఎదుర్కొంటున్నారు. సొంత భూములున్న రైతన్న పరిస్థితి ఇలా ఉంటే భూములేని కౌలు రైతుల పరిస్థితి ఇంకా దారుణంగా ఉంది. కౌలు రైతులకు ప్రభుత్వం ఏ విధమైన భరోసా, పెట్టుబడి ఆర్థిక సహాయం కల్పించకపోవడంతో మన్యం జిల్లాలో సాగు విస్తీర్ణం రోజురోజుకు తగ్గిపోతుంది. ఖరీఫ్ సాగు చివరి దశకు చేరింది. పంటలు పలుచోట్ల పక్వానికి, కొన్నిచోట్ల పొట్టదశకు చేరుకున్నాయి. అక్టోబర్ మొదటి వారంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయనున్నట్లు అధికారులు ప్రకటించారు. అయితే ఇప్పటికీ కౌలురైతులకు 'అన్నదాత సుఖీభవ' సొమ్ము అందని దుస్థితి నెలకొంది. జిల్లాలో 70 శాతం కౌలురైతులే సాగులో చేస్తున్నారు. సాగులో కౌలురైతులదే కీలక పాత్ర. అయినప్పటికీ కూటమి సర్కార్ కౌలురైతుల పట్ల తీవ్ర వివక్ష ప్రదర్శిస్తుందన్న విమర్శలు వినిపిస్తున్నాయి.

జిల్లాలో ఈ ఏడాది 11వేలు మంది రైతులకు కౌలుకార్డులు జారీ చేయాలని లక్ష్యంగా ప్రభుత్వం నిర్ణయించింది. అయితే ఇప్పటికీ కౌలుకార్డుల జారీ ప్రక్రియ పూర్తి కాలేదు. జిల్లాలో 9345 వేల వరకు కౌలుకార్డులు జారీ చేసినట్లు తెలుస్తోంది. ఇంకా 1655 మందికి పైగా రైతులకు కౌలుకార్డులు ఇవ్వాల్సి ఉంది. వాస్తవంగా జిల్లాలో దాదాపు 30 వేల మంది వరకు కౌలు రైతులు ఉన్నారు. అయితే ప్రభుత్వం కేవలం 11వేలమందిని మాత్రమే గుర్తించి తూతూమాత్రంగా సిసిఆర్సి కార్డులు నమోదు చేస్తున్నారు తప్ప గ్రామస్థాయిలో పరిశీలన చేసి కౌలుకు చేస్తున్న ప్రతి రైతుకు విధిగా కౌలు గుర్తింపు కార్డు అందజేయడంలేదు. అక్కడ ఉన్న నాయకులు వారికి అనుకూలంగా ఉన్న కొంతమంది కౌలు రైతులకు మాత్రమే గుర్తింపు కార్డులు ఇస్తున్నారు తప్ప చిన్నచిన్న రైతులకు గుర్తింపు కార్డులు ఇచ్చే పరిస్థితి కనిపించడం లేదు. ప్రతి గ్రామంలోనూ 10 నుంచి 20, 30 మంది వరకు కౌలు రైతులు ఉన్నారు. ఇచ్చిన కార్డులు కూడా పూర్తి శాతం నమోదు చేయకపోగా, కొన్ని కార్డుల్లో తప్పిదాలు ఉండడంతో ప్రభుత్వం ఇచ్చే రాయితీలు వర్తించే పరిస్థితి లేదు. కౌలు గుర్తింపు కార్డు నమోదుకు అక్టోబర్ నెలాఖరుకు పూర్తి చేయాలని చెబుతున్నా, ఆ ప్రక్రియ అవుతుందో లేదో తెలియని పరిస్థితి ఉంది. కౌలుకార్డుల జారీ ప్రక్రియ పూర్తయిన తర్వాతే అన్నదాత సుఖీభవ సొమ్ము ఇస్తామని ప్రభుత్వం చెబుతోంది. కౌలురైతులకు పెట్టుబడి సాయం ఎగ్గొట్టేందుకే ప్రభుత్వం ఇలా వ్యవహరిస్తుందనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. పెట్టుబడి సాయం అనేది సాగు ఆరంభంలో ఇవ్వాలి.

జిల్లాలో కౌలు గుర్తింపు కార్డు నియోజకవర్గాల వారీగా వివరాలు

పార్వతీపురంలో 3900 మందికి కౌలు గుర్తింపు కార్డులు ఇచ్చేందుకు లక్ష్యంగా తీసుకోగా 3009 మందికి నమోదు చేయగా, ఇంకా 257 మంది కౌలు రైతులకు నమోదు చేయాల్సి ఉంది. కురుపాంలో 2850 మందికి కౌలు గుర్తింపు కార్డులు లక్ష్యం తీసుకోగా, 2519 మందికి నమోదు చేయగా, ఇంకా 331 మంది కౌలు రైతులకు నమోదు చేయాల్సి ఉంది. అలాగే పాలకొండలో 2250 మందికి కౌలు గుర్తింపు కార్డులు చేసేందుకు లక్ష్యం తీసుకోగా 2031 మందికి నమోదు చేయగా, ఇంకా 219 మంది కౌలు రైతులకు నమోదు చేయాల్సి ఉంది. సాలూరులో 2000 మందికి కౌలు గుర్తింపు కార్డులు చేసేందుకు లక్ష్యం తీసుకోగా 1786 మందికి నమోదు చేయగా ఇంకా 219 మంది కౌలు రైతులకు నమోదు చేయాల్సి ఉంది.

ఖరీఫ్ సాగు చివరి దశకు చేరుతున్నా అన్నదాత సుఖీభవ కింద అందించే పెట్టుబడి సాయం మాత్రం కౌలురైతులకు అందలేదు. భూ యజమానులకు మాత్రం మొదటి విడత సొమ్ము ప్రభుత్వం జమ చేసింది. సాగులో కీలకమైన కౌలు రైతులకు మాత్రం అన్నదాత సుఖీభవ సొమ్ము జమ చేయలేదు. ఇప్పటి వరకూ కౌలురైతులకు ఏ ఒక్క సాయమూ లేదు. కౌలురైతులకు బ్యాంకు రుణాలు సైతం సక్రమంగా ఇవ్వని పరిస్థితి ఉంది.

కౌలు చట్టంపై దొంగాట

తాము అధికారంలోకి వస్తే వైసిపి ప్రభుత్వం 2019లో తీసుకొచ్చిన కౌలుచట్టాన్ని మార్పు చేస్తామని కూటమి నేతలు ఎన్నికల్లో చెప్పారు. వైసిపి తెచ్చిన చట్టంలో భూయజమాని అంగీకారంతోనే కౌలుదారులకు కౌలుకార్డులు ఇవ్వాలని నిబంధన పెట్టారు. దీంతో భూ యజమానులు కౌలుదారులకు కార్డులు ఇచ్చేందుకు అంగీకరించడం లేదు. దీంతో కౌలురైతులకు ప్రభుత్వం నుంచి ఎటువంటి సాయం అందడం లేదు. సాగుచేయని భూయజమానులే ప్రభుత్వం అందించే పెట్టుబడి సాయం, పంట నష్టపరిహారం, బీమా పరిహారం వంటివి తీసుకుంటున్నారు. దీంతో కౌలురైతుల ఆత్మహత్యలు పెరుగుతున్న పరిస్థితి ఉంది. తాము అధికారంలోకి వస్తే కౌలుచట్టంలో మార్పులు తెచ్చి కౌలురైతులను ఆదుకుంటామని కూటమి నేతలు ఎన్నికల్లో హామీ ఇచ్చారు. గెలిచిన తర్వాత పలు జిల్లాల్లో అభిప్రాయ సేకరణ పేరుతో సమావేశాలు సైతం నిర్వహించారు. ఆ తర్వాత పూర్తిగా పక్కన పెట్టేశారు. దీన్ని బట్టి చూస్తే కౌలుచట్టంపై ప్రభుత్వం దొంగాట ఆడుతుందనే చర్చ కౌలురైతుల్లో నెలకొంది.

రబ్బర్ డ్యామ్‌ను పరిశీలించిన ఆస్ట్రియా బృందం



రబ్బరు డ్యాంను వివరాలను తెలుసుకుంటున్న ఆస్ట్రియా బృందం సభ్యులు

ప్రజాశక్తి - కొమరాడ

ఆసియా ఖండంలోనే రెండో రబ్బర్ డాంగా పేరుగాంచిన మండలంలోని జంఝావతి రబ్బరు డ్యామును ఆస్ట్రియా టెక్నీషియన్ బృందం శుక్రవారం పరిశీలించింది. మండలంలోని రాజ్యలక్ష్మీపురం వద్ద ఉన్న రబ్బర్ డాం ఏర్పాటు చేసి 20 ఏళ్లు పూర్తి కావస్తున్న నేపథ్యంలో దాని పరిస్థితులను పరిశీలించేందుకు ప్రాజెక్ట్ అధికారులు, టెక్నీషియన్ బృందం పరిశీలించారు. 2006లో ఏర్పాటు చేసిన ఈ డ్యాము నిర్మాణం ఆసియా ఖండంలోనే రెండో అతిపెద్ద డ్యాంగా ప్రపంచంలో గుర్తింపు పొందిన విషయం తెలిసిందే. ఈ డ్యామును అప్పటి ఆస్ట్రియా సాంకేతికతతో ఆ దేశానికి చెందిన టెక్నీషియన్లు వచ్చి ఈ డ్యామును ఏర్పాటు చేశారు. ఇప్పటి వరకు ఇరిగేషన్ అధికారులు ఈ డ్యామ్ నిర్వహణ పనులు చేస్తూ వాడుకంలో ఉన్నప్పటికీ 20 ఏళ్లు పూర్తయిన నేపథ్యంలో దాని పరిస్థితులు పనితీరు పరిశీలనకు పర్యటన చేసినట్లు అధికార బృందం తెలిపారు. ఈ మేరకు డ్యామ్ పనితీరును మిషనరీ అంతటినీ పరిశీలించారు. ఆన్ ఆఫ్ స్విచ్ బోర్డు నుంచి స్క్రీన్లతో పరిశీలన చేసి ఎక్కడైనా వైర్లు మిషనరీ మోటర్లు తదితర వంటివి సక్రమంగా పనిచేస్తున్నాయా లేదా గతం కంటే వేగం ఏ మాత్రమైనా తగ్గిందా అన్న పరిశీలన క్షుణ్ణంగా ఆస్ట్రియా నుంచి వచ్చిన టెక్నీషియన్ చేశారు. ఈ సందర్భంగా ప్రాజెక్ట్ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ రవీంద్ర మాట్లాడుతూ 20 ఏళ్లు పూర్తయిన నేపథ్యంలో సాంకేతిక సమస్యలు స్వల్పంగా వస్తున్నాయని, దీంతో గతంలోనే ఆస్ట్రియా టెక్నీషియన్లకు లేఖల ద్వారా సమస్యను వివరించామని తెలిపారు. దీనిపై స్పందించిన టెక్నీషియన్ సభ్యులు పరిశీలనకు వచ్చి ఏవైనా చిన్నచిన్న లోపాలుంటే సరి చేసేందుకు ప్రయత్నాలు చేస్తున్నట్లు తెలిపారు. ఈ పరిశ్రమంలో స్థానిక ప్రాజెక్టు అధికారులు టెక్నీషియన్లు పాల్గొన్నారు.

ట్రాన్స్‌ఫార్మర్ సామర్థ్యం తగ్గింపుపై ఆందోళన

ప్రజాశక్తి - సాలూరు



రోడ్డుపై నిరసన తెలుపుతున్న పట్టణ ప్రజలు

పట్టణంలోని ఏడో వార్డు పరిధిలో గల రాజేశ్వరరావు పార్కు సమీపాన గల 160 కెవి ట్రాన్స్ఫార్మర్ తీసివేసి దాని స్థానంలో 100 కెవి ట్రాన్స్‌ఫార్మర్‌ను అధికారులు మార్చడాన్ని నిరసిస్తూ ఆ వార్డు ప్రజలు పట్టణ పౌర సంక్షేమ సంఘం కార్యదర్శి ఎన్వై నాయుడు, మున్సిపల్ వైస్ చైర్మన్ వంగపండు అప్పలనాయుడు ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. తక్కువ ఓల్టేజీ ట్రాన్స్‌ఫార్మర్ పెట్టడం వల్ల కార్మిక వాడల్లో ప్రజలు ఇబ్బందులు పడతారని, ఇప్పటికే ఆ సమస్య ఉందని వెంటనే పాత ట్రాన్స్‌ఫార్మర్ ఉంచాలని డిమాండ్ చేస్తూ నిరసన తెలిపారు. దీంతో వద్దకు పట్టణ సిఐ అప్పలనాయుడు, విద్యుత్‌శాఖ ఎఇలు వచ్చి యధావిధిగా పాత కెపాసిటీ ట్రాన్స్‌ఫార్మర్ ఉంచుతామని హామీ ఇచ్చి తీసివేసిన దాన్ని మళ్లీ బిగించారు. దీంతో ప్రజలు శాంతించి నిరసన విరమించారు. కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ రవి, వార్డు పెద్దలు సామయ్య, వెంకట్రావు, విజయ్, శ్రీను పెద్ద ఎత్తున ప్రజలు పాల్గొన్నారు.



విద్యార్థులను బోధనా విధానం అడిగి తెలుసుకుంటున్న ట్రైకార్ ఎమ్‌డి మణికుమార్

మెరుగైన విద్యాబోధన జరగాలి

ట్రైకార్ మేనేజింగ్ డైరెక్టర్ మణికుమార్

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

ఆశ్రమ పాఠశాలల్లో గిరిజన విద్యార్థులకు మెరుగైన విద్యా బోధన జరగాలని ఆ దిశగా ఉపాధ్యాయులు పనిచేసి పరీక్షల్లో మంచి ఫలితాల సాధనకు కృషి చేయాలని రాష్ట్ర ట్రైకార్ బోర్డ్ మేనేజింగ్ డైరెక్టర్ సిఎ మణికుమార్ సూచించారు. గుమ్మలక్ష్మీపురం ఏజెన్సీ పర్యటనకు వచ్చిన సందర్భంగా భద్రగిరి పిటిజి, కొత్తగూడ, టిక్కబాయి ఆశ్రమ పాఠశాలలను శుక్రవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు, విద్యార్థులతో మాట్లాడారు. విద్యాబోధన, పాఠ్యాంశాలపై విద్యార్థులకు అవగాహన వంటి విషయాలపై పరిశీలించారు. విద్యార్థులు చదువు పట్ల ఏ మేరకు పట్టు సాధించారు వంటి అంశాలను అడిగి తెలుసుకున్నారు. అలాగే పాఠశాల ఆవరణంలో పరిసరాల పరిశుభ్రత, విద్యార్థుల ఆరోగ్య స్థితిగతులు తీసుకుంటున్న జాగ్రత్తలు అడిగి తెలుసుకున్నారు. అలాగే మెనూ అమలు తీరు పరిశీలించారు. ప్రభుత్వం గిరిజన విద్యకు అధిక ప్రాధాన్యత ఇస్తుందని విద్యార్థులు క్రమశిక్షణతో ఉండి బాగా చదువుకోవాలని అన్నారు. కార్యక్రమంలో ఎటిడబ్ల్యూఒ రజిని తదితరులు ఉన్నారు.

ప్రభుత్వ ఖాళీ స్థలాల నుంచి ఆదాయం తేవాలి

ప్రజాశక్తి - పార్వతీపురం



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రభాకరరెడ్డి, జెసి యశ్వంత్‌కుమార్‌రెడ్డి

జిల్లాలో ఖాళీగా ఉన్న ప్రభుత్వ భూమిలో వ్యవసాయ, ఉద్యానవన పంటలను వేసి, ఆ గ్రామాలకు ఆదాయం వచ్చేలా ఆలోచన చేస్తున్నామని, అందుకు తగిన విధంగా ప్రణాళికలను సిద్ధం చేయాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎన్.ప్రభాకరరెడ్డి సంబంధిత అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో వ్యవసాయ అనుబంధ రంగాల అధికారులతో కలెక్టర్ సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలోని ఖాళీ ప్రభుత్వ భూముల నుంచి ఆదాయం తీసుకురావడమే కాకుండా, జిల్లాలోని అన్ని చెరువులను ఫిష్ ట్యాంకులుగా మార్చేందుకు ఆలోచన చేసినట్లు కలెక్టర్ వివరించారు. తద్వారా ప్రభుత్వానికి ఆదాయం రావడమే కాకుండా ప్రజలకు, రైతులకు ఉపాధి కల్పించినట్లు అవుతుందని స్పష్టం చేశారు. ఖాళీ ప్రభుత్వ భూములకు సంబంధించి సర్వే, భూరికార్డుల అధికారుల నుంచి వివరాలు తీసుకొని, వాటిని క్షేత్రస్థాయిలో పరిశీలించి, ఆ భూమికి అనుకూలమైన పంటలను వేసేలా ప్రణాళికలు రచించుకోవాలని పేర్కొన్నారు. ఖాళీ స్థలంలో పిచ్చిమొక్కలు వంటివి ఉంటే వాటిని ఉపాధి హామీ పథకం కింద జంగిల్ క్లియరెన్స్ చేయించేలా ప్రతిపాదనలను ఇవ్వాలని సూచించారు. అలాగే జిల్లాలో 2 వేల పైచిలుకు చెరువులు, కుంటలు ఉన్నాయని, అవి వృథాగా ఉండరాదని, వాటి అభివృద్ధికి కూడా ప్రణాళికలను రూపొందించాలని, కనీసం 6 అడుగుల లోతున ఏడాది మొత్తం నీరు నిల్వ ఉండేలా ప్రతిపాదనలను, అంచనాలను ఈ నెల 20వ తేదీలోగా సిద్ధం చేయాలని కలెక్టర్ పేర్కొన్నారు. వీటికి సంబంధించిన మండలస్థాయి. ప్రతిపాదనలను ఎంపిడిఒల ద్వారా ఈనెల 23లోగా డ్వామా పీడీ, ఇఇ ఇరిగేషనుకు, 25నాటికి జిల్లా కలెక్టర్ అనుమతి కొరకు ప్రతిపాదనలు సమర్పించాలని ఆదేశించారు. ఇప్పటికే సిద్ధంగా ఉన్న భూముల్లో వ్యవసాయ, ఉద్యానవన, పట్టు సాగు పంటలతో పాటు మత్స్య సంపద ఏర్పాటుకు సిద్ధం చేయాలని, ఈ భూముల నిర్వహణను ఆసక్తి గల ఎస్‌హెచ్‌జిలకు అప్పగించాలని, ఇందులో విభిన్న ప్రతిభావంతులకు, మహిళలకు, యువతకు తొలి ప్రాధాన్యతను ఇస్తూ వేలం ద్వారా కేటాయించాలని తెలిపారు. గ్రామాల్లో ఉండే ప్రభుత్వ భూములు ప్రభుత్వ ఆస్తిగానే ఉంచుతామని, ఇందులో ఎటువంటి సందేహం వద్దని స్పష్టం చేశారు. జిల్లాలో ఉండే అన్ని చెరువులు, కుంటలను ఫిష్ ట్యాంకులుగా మారుస్తామని, ఆసక్తి గల వారితో చేపల పెంపకం చేపట్టేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. ఈ ఏడాది 10 వేల మందిని వ్యాపారవేత్తలుగా మార్చేందుకు ఆలోచన చేస్తున్నామని, అందులో భాగంగా వ్యవసాయ అనుబంధ రంగాల నుంచి సుమారు 5 వేల మంది వ్యాపారవేత్తలను సిద్ధం చేసేలా అధికారులు చర్యలు తీసుకోవాలని తెలిపారు. వ్యవసాయ, ఉద్యానవన, పట్టు, మత్స్య శాఖల ద్వారా చేపట్టేబోయే కార్యక్రమాలపై ఔత్సాహిక వ్యాపారవేత్తలకు పూర్తిస్థాయిలో ముందుగా అవగాహన కల్పించాలని అన్నారు. అలాగే వారికి విత్తనం దగ్గర నుంచి మార్కెటింగ్ సదుపాయం వరకు అవసరమైన శిక్షణను ఇస్తూ, రుణాలను కూడా మంజూరు చేసేలా అన్ని చర్యలు చేపట్టాలని అధికారులకు స్పష్టం చేశారు. వ్యవసాయ అనుబంధ రంగాల ద్వారా రైతులు అధిక ఆదాయం పొందేలా లాభసాటి పంటలపై రైతులు దృష్టి సారించేలా అవగాహన కల్పించాలని కలెక్టర్ తెలిపారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ సి. యశ్వంత్ కుమార్ రెడ్డి, జిల్లా వ్యవసాయ అధికారి కె.రాబర్ట్‌పాల్, ఐటిడిఎ ఎపిఒ ఎ.మురళీధర్, జిల్లా ఉద్యానవన అధికారి కెఎస్ఎన్ రెడ్డి, జిల్లా సూక్ష్మ నీటిపారుదల అధికారి వి.రాధాకృష్ణ, ఎపి మార్క్‌ఫెడ్ జిల్లా మేనేజర్ వై.విమల, జిల్లా మత్స్య శాఖాధికారి టీ.సంతోష్ కుమార్, ఇతర అధికారులు పాల్గొన్నారు.



సమస్యలను పరిశీలిస్తున్న ఎస్‌పి మాధవరెడ్డి

సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యం : ఎస్‌పి

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

జిల్లా పోలీసుశాఖలో వివిధ హోదాల్లో పనిచేస్తున్న పోలీసు అధికారులు, సిబ్బంది సమస్యల పరిష్కారానికి, సంక్షేమానికి ముఖ్య ప్రాధాన్యతను ఇస్తూ సిబ్బంది వృత్తి, ఆరోగ్యపరమైన, వ్యక్తిగతమైన పలు సమస్యల పరిష్కారానికి అధిక ప్రాధాన్యత ఇస్తున్నట్టు ఎస్‌పి ఎస్‌వి మాధవరెడ్డి తెలిపారు. శుక్రవారం స్థానిక జిల్లా పోలీస్ కార్యాలయంలో ఎస్పీ గ్రీవెన్స్-డే ను నిర్వహించగా, ఈ కార్యక్రమంలో జిల్లాలోని పోలీస్ సిబ్బంది పాల్గొని వారి సమస్యలను ఎస్పీకి తెలియజేశారు. సిబ్బంది తెలిపిన సమస్యలను ఎస్‌పి విని, ఇచ్చిన ఫిర్యాదులను పరిశీలించి సత్వర పరిష్కారానికి అవకాశం ఉన్న సమస్యలను వెంటనే పరిష్కరించారు. మిగిలిన సమస్యలను త్వరలోనే పరిష్కరిస్తామని పోలీసు సిబ్బందికి భరోసా కల్పించారు. జిల్లా పోలీస్ కార్యాలయ (డిపిఒ) సంబధిత ఫిర్యాదులపై సంబంధిత అధికారులతో ఎస్పీ మాట్లాడి, పరిష్కారానికి అవకాశం ఉన్న సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు. కార్యక్రమంలో సిసి సంతోష్ కుమార్ , సిబ్బంది పాల్గొన్నారు.

సంత నర్సిపురంలో వైద్య శిబిరం

వీరఘట్టం : మండలంలోని సంత నర్సిపురంలో శుక్రవారం వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా జ్వర పీడితులు, మధుమేహ, రక్తపోటు, గర్భిణీలు తదితర రకాలైన రోగులకు వైద్య తనిఖీలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పిలు, ఎఎన్ఎం, ఆశా కార్యకర్తలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ఎమ్మెల్యే పరామర్శ

ప్రజాశక్తి - కురుపాం



విశాఖ కెజిహెచ్‌లో చికిత్స పొందుతున్న విద్యార్థినుల పరామర్శిస్తున్న ఎమ్మెల్యే జగదీశ్వరి

స్థానిక గురుకుల పాఠశాల విద్యార్థులు పచ్చకామర్ల బారిన పడి విశాఖ కెజిహెచ్‌లో చికిత్స పొందుతున్న వారిని శుక్రవారం ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి పరామర్శించారు. విద్యార్థులతో మాట్లాడి వారి యోగక్షేమాలు అడిగి తెలుకొని కెజిహెచ్ సీనియర్ వైద్యులు ఐ. వాణితో మాట్లాడి విద్యార్థుల ఆరోగ్య పరిస్థితి గూర్చి ఆరా తీశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ విద్యార్థులు త్వరగా కోలుకొనేలా ప్రభుత్వపరంగా అన్ని విధాలా సహాయ సహకారాలతో పాటు మెరుగైన వైద్యమందిస్తున్నామని శుక్రవారం కెజిహెచ్ నుంచి పదిమంది విద్యార్థులను డిశ్చార్జ్ చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర ఎస్టీ కమిషన్ సభ్యులు కద్రక మల్లేశ్వరరావు, నియోజకవర్గ కూటమి నాయకులు పాల్గొన్నారు.

గురుకుల పాఠశాలను సందర్శించిన రాష్ట్ర ట్రైకర్ బోర్డు డైరెక్టర్

స్థానిక గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాలను రాష్ట్ర ట్రైకార్ బోర్డు డైరెక్టర్ పువ్వుల లావణ్య సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాల డైనింగ్ హాలు, వంటగది, మరుగుదొడ్లు, డ్రైనేజీ, తరగతి గదులను పరిశీలించారు. అనంతరం వైస్ ప్రిన్సిపాల్‌తో మాట్లాడి విద్యార్థులు అనారోగ్యం బారిన పడడానికి గల కారణాలను తెలుసుకున్నారు. పాఠశాల పరిసర ప్రాంతాల్లో పారిశుధ్య కార్యక్రమాలు ప్రతిరోజు చేస్తూ పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు.

మృతి చెందిన విద్యార్థుల కుటుంబాలకు పరామర్శ

పచ్చకామెర్ల బారిన పడి మృతి చెందిన స్థానిక గురుకుల పాఠశాల విద్యార్థులు తోయక అంజలి, తోయక కల్పన కుటుంబ సభ్యులను రాష్ట్ర ట్రాకర్ బోర్డు మెంబర్ పువ్వుల లావణ్య వారి గ్రామాలైన కంబగూడా, దండుసుర వెళ్లి పరామర్శించారు. కుటుంబ సభ్యులకు ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుందని ధైర్యాన్ని ఇచ్చి ఓదార్చారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు పాల్గొన్నారు.

విద్యార్థుల ఆరోగ్య సమస్యలను గుర్తించాలి

ఎస్‌టి కమిషన్ మాజీ చైర్మన్ డివిజి

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

మన్యం జిల్లాలో ఆశ్రమ పాఠశాలల్లో చదువుతున్న గిరిజన విద్యార్థుల అనారోగ్య సమస్యలను గుర్తించి స్థానికంగా వైద్య సేవలందించేలా ఆరోగ్య కార్యకర్తలను నియమించాలని ఎస్‌టి కమిషన్ మాజీ చైర్మన్ డివిజి శంకరరావు ప్రభుత్వాన్ని కోరారు. గుమ్మలక్ష్మీపురంలో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ముఖ్యంగా విద్యార్థులు దోమకాటు నుంచి రక్షణ పొందడానికి ప్రభుత్వం దోమతెరలు పంపిణీ చేయాలన్నారు. విద్యార్థుల్లో రక్తహీనత గుర్తించి పౌష్టికాహారమందించాలన్నారు. విద్యార్థుల సంఖ్యకు తగిన విధంగా వసతులు కల్పించాలన్నారు. అలాగే పాఠశాలల్లో రక్షిత మినరల్ ట్యాంకులు ఎప్పటికప్పుడు మరమ్మతులు చేపడితే విద్యార్థులకు సురక్షితమైన తాగునీరు అందుబాటులో ఉంటుందన్నారు. కురుపాం గురుకుల పాఠశాలలో ఇద్దరు విద్యార్థులు మృతి చెందడం బాధాకరమన్నారు. ఒకేసారి 120 మంది విద్యార్థులు పచ్చకామెర్లు బారిన పడి పార్వతీపురం, విశాఖ కేజీలో చికిత్స పొందుతున్నారని అన్నారు. మృతుల కుటుంబాలకు వైఎస్ జగన్ రూ.5 లక్షలు చొప్పున నష్టపరిహారం ప్రకటించడం పట్ల ధన్యవాదాలు తెలిపారు.

జిఎస్‌టిపై అవగాహన కల్పించాలి : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - పార్వతీపురం

జీఎస్టి 2.0 సంస్కరణలపై చివరి వ్యక్తి వరకు అవగాహన కల్పించాలని, తద్వారా సామాన్యుల్లో కొనుగోలు సామర్థ్యం మరింత పెరగాలని స్థానిక ఎమ్మెల్యే బి.విజయచంద్ర, జాయింట్ కలెక్టర్ సి.యశ్వంత్‌కుమార్‌రెడ్డి అన్నారు. శుక్రవారం స్థానిక ఆర్యవైశ్య కల్యాణ మండపంలో ఏర్పాటు చేసిన ఎలక్ట్రానిక్స్ ఎగ్జిబిషన్ కమ్ సేల్స్ కార్యక్రమానికి ఎమ్మెల్యే, జెసి ముఖ్య అతిథిలుగా పాల్గొని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎలక్ట్రానిక్స్ ఉత్పత్తులకు సంబంధించి శుక్ర, శని వారాల్లో సూపర్ జిఎస్‌టి సూపర్ సేవింగ్స్ కింద తగ్గించిన టాక్స్‌తో విక్రయాలు నిర్వహించి ప్రజలకు అవగాహన కల్పించాలనే ఈ ప్రదర్శన ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. జెసి మాట్లాడుతూ జీఎస్టీ 2.0 ద్వారా వచ్చే లాభాన్ని చివరి వ్యక్తి వరకూ తీసుకొని వెళ్లినట్లయితే మనం విజయం సాధించినట్లేనని జేసీ అన్నారు. కార్యక్రమంలో వాణిజ్య పన్నుల శాఖ డిసి డేవిడ్ అనిల్ కుమార్, ఎసి వి.గజలక్ష్మి, కెకెఎం ఎలక్ట్రానిక్స్, సౌందర్య ఎంటర్ ప్రైజెస్, మణి ఎలక్ట్రానిక్స్ సంస్థల ప్రతినిదులు పాల్గొన్నారు.

సీతానగరం : సూపర్ జీఎస్‌టి - సూపర్ సేవింగ్స్‌కు సంబంధించిన పోస్టర్లను మండల పరిషత్ ఎఒ సిహెచ్‌విెకె వెంకటరావు ఆవిష్కరించారు. అ నవంబర్ 19 వరకు మండలంలో సూపర్ జీఎస్టీ... సూపర్ సేవింగ్స్ పేరుతో విస్తృత స్థాయిలో అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్య క్రమంలో ఆర్యవైశ్య సంఘం జిల్లా అధ్యక్షులు మమ్ముల సోమేశ్వరరావు, గ్రామ పెద్దలు గరికయ్య పాల్గొన్నారు.

ఐద్వా రాష్ట్ర మహాసభను జయప్రదం చేయండి

ప్రజాశక్తి - కొమరాడ

ఈనెల 13 నుంచి 15 వరకు జరగనున్న ఐద్వా రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని ఐద్వా జిల్లా నాయకులు వి.ఇందిర పిలుపునిచ్చారు. మండలంలోని శివినిలో మహాసభలు ప్రారంభం సూచికలో భాగంగా శుక్రవారం ఐద్వా జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈనెల 13, 14,15 తేదీల్లో అనంతపురంలో ఐద్వా మహాసభలు జరుగుతున్నాయన్నారు. ఈ మహాసభలకు అన్ని వర్గాలకు చెందిన మహిళలు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. దేశం, రాష్ట్రంలో మహిళలకు రోజురోజుకు రక్షణ కరువవుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. చిన్నా పెద్దా తేడా లేకుండా మహిళలపై జరుగుతున్న లైంగిక దాడులను అరికట్టేందుకు మహిళా రక్షణకై కొత్త చట్టాలను తేవాలని డిమాండ్ చేశారు. ఉపాధి హామీ చట్టంలో మహిళలకు 200 రోజులు పని దినాలు కల్పించి రోజుకు రూ.600 వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. మహిళలకు ఆహార భద్రత లేకపోవడంతో రక్తహీనత లోపంతో ఎక్కువమంది మహిళలు ఇబ్బందులు పడుతున్నా రని తెలిపారు. డ్వాక్రా మహిళలకు రుణాలు సక్రమంగా ఇవ్వకపోవడంతో ఉపాధి అవకాశాలు కోల్పోయి మైక్రో ఫైనాన్స్ సంస్థలపై ఆధార పడాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. మహిళల రక్షణకై వారి హక్కులను కాపాడుకునేలా ఈ మహాసభల్లో తీర్మానాలు చేసి భవిష్యత్తు పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మహిళలు మహిళా సంఘాల నేతలు పాల్గొన్నారు.



బలిజిపేటలో జెండాను ఆవిష్కరిస్తున్న ఐద్వా నాయకులు

బలిజిపేట: మండలంలోని పలగర వద్ద గల గుడివాడ కాలనీలో ఐద్వా జెండాను ఎగురవేశారు. మండల ఐద్వా అధ్యక్ష కార్యదర్శులు వై సుధా, యు.లక్ష్మి మాట్లాడుతూ సమాజంలో సగభాగం మహిళలని చెప్పిన ప్రభుత్వాలు, పాలకులు మహిళలకు సరైన న్యాయం చేయడం లేదని ప్రశ్నించారు. బ్యాంకులు రుణాలివ్వక పోవడంతో మైక్రో ఫైనాన్స్ సంస్థల నుంచి అధిక వడ్డీలకు అప్పులు వాడి అనేక ఇబ్బందులకు గురవుతున్నారని అన్నారు. అధిక వడ్డీల బారి నుంచి మహిళలను రక్షించాలంటే రాష్ట్ర ప్రభుత్వం వడ్డీ లేని డ్వాక్రా రుణాలివ్వాలని డిమాండ్ చేశారు. బెల్ట్ షాపులు, మద్యం దుకాణాలను ప్రభుత్వం అరికట్టాలని డిమాండ్ చేశారు. అసంఘటిత రంగ మహిళలపై పెరుగుతున్న దాడులు, అత్యాచారాలు హత్యలు జరుగుతుందని, కావున మహిళలంతా ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా పోరాడాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు జయమ్మ, గౌరమ్మ, పాపమ్మ, కళావతి, లక్ష్మమ్మ, ఈశ్వరమ్మ తదితరులు పాల్గొన్నారు.



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న వైసిపి నాయకులు

కోటి సంతకాల ప్రజా ఉద్యమం

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

మాజీ సిఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు మాజీ ఎమ్మెల్యే అలజంగి జోగారావు, నియోజకవర్గ పరిశీలకులు రాష్ట్ర పార్టీ కార్యదర్శి మావూడి శ్రీనివాసరావుతో కలిసి శుక్రవారం తన క్యాంప్ కార్యాలయంలో మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కోటి సంతకాలు ప్రజా ఉద్యమం పోస్టర్ విడుదల చేశారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే జోగారావు మాట్లాడుతూ నేటి నుంచి వైసిపి 'రచ్చబండ' కార్యక్రమం ప్రారంభించడం జరుగుతుందని, నేటి నుంచి 40 రోజుల పాటు ప్రజా ఉద్యమాన్ని చేపట్టనున్నామని, ఇందులో భాగంగా నవంబర్ 22 వరకు 'రచ్చబండ' కార్యక్రమాలు నిర్వహిస్తామని, ఈ నెల28న నియోజకవర్గాల్లో, నవంబర్ 12న జిల్లా కేంద్రాల్లో ర్యాలీలు జరగనున్నాయని, కోటి సంతకాలు సేకరించాలని పార్టీ లక్ష్యంగా పెట్టుకుందని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా పార్టీ ప్రధాన కార్యదర్శి పోల సత్యనారాయణ, అధికార ప్రతినిధి ముర్వల సత్యంనాయుడు, ఎస్సీ సెల్ అధ్యక్షులు సర్వేశెట్టి శ్రీనివాసరావు, మండల పార్టీ అధ్యక్షులు బొమ్మి రమేష్, అనుబంధ విభాగాల అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులు, కార్యదర్శులు, సర్పంచులు, ఎంపిటిసి సభ్యులు, సీనియర్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



సమస్యలను ఎమ్మెల్యేకు వివరిస్తున్న గిరిజనులు

సమస్యల పరిష్కారానికి కృషి : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

ప్రజలు విన్నవించిన ప్రతి సమస్యను పరిశీలించి పరిష్కారానికి కృషి చేస్తానని కురుపాం ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి అన్నారు. శుక్రవారం ఎమెల్యే క్యాంపు కార్యాలయంలో దర్బార్ నిర్వహించారు. ప్రజలు అందించిన వినతులను స్వీకరించి వాటిని పరిశీలించి సంబంధిత అధికారులతో మాట్లాడారు. రహదారులు వేయాలని, తాగునీటి సౌకర్యం కల్పించాలని తదితర సమస్యలపై ప్రజలు వినతులు అందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వచ్చిన వినతులపై సంబంధిత అధికారులకు తెలియజేసి పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. ప్రజా సమస్యలు పరిష్కరించడానికి ఆయా శాఖల అధికారులు కూడా సహకరించాలని సూచించారు. కార్యక్రమంలో మండల టిడిపి అధ్యక్షులు అడ్డాకుల నరేష్, రాష్ట్ర ఎస్టీ కమిషన్ సభ్యులు కడ్రక మల్లేశ్వరరావు, బిజెపి ఎస్టీ మోర్చా జిల్లా అధ్యక్షులు నిమ్మక సింహాచలం, డుమ్మంగి సర్పంచ్ పాలక క్రాంతి కుమార్, కడాయి, రామారావు తదితరులు పాల్గొన్నారు.

స్మార్టు కార్డులు పంపిణీ

ప్రజాశక్తి - పార్వతీపురం

నియోజకవర్గానికి సంబంధించి క్యూఆర్ కోడ్ తో కూడిన స్మార్ట్ రేషన్ కార్డులను శుక్రవారం కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో పౌర సరఫరాలశాఖ ఆధ్వర్యంలో లబ్దిదారులకు స్థానిక ఎమ్మెల్యే బి.విజయచంద్ర అందజేశారు. కార్యక్రమంలో డిఎస్ఒ బాలసరస్వతి మాట్లాడుతూ జిల్లాలో దాదాపుగా 2,73,000 మంది స్మార్ట్ కార్డులు తీసుకుంటున్నారని అన్నారు. ఒక్క పార్వతీపురం పట్టణంలో 67 వేల మంది లబ్ధిదారులున్నారని చెప్పారు. పీడీ రేషన్ బియ్యం అక్రమ రవాణ అరికట్టే బాధ్యత అందరిపైనా ఉందని తెలిపారు. సమావేశంలో సబ్ కలెక్టర్ ఆర్.వైశాలి, కొప్పుల వెలమ డైరక్టర్ జి.వెంకటనాయుడు, తహశీల్దార్ సురేష్, ఎఎస్ఒ ప్రదీప్ చంద్ర, లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.



కార్యక్రమంలో మాట్లాడుతున్న సూపర్‌వైజర్ పద్మ

చెల్లింపేటలో పోషణ్ మహాలి

ప్రజాశక్తి - బలిజిపేట

మండలంలోని చెల్లింపేట అంగన్వాడీ కేంద్రంలో ఐసిడిఎస్ సూపర్‌వైజర్ పద్మ ఆధ్వర్యాన విజయవాహిని చారిటబుల్ ఫౌండేషన్, టాటా ట్రస్ట్ సహకారంతో పోషణ్ మహాలి కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గర్భిణులు, తల్లులు, మహిళలు, ఇతరులకు పోషకాహారం, ఊబకాయం, మాల్ న్యూట్రిషన్,10- రకాలు ఆహారాలు (సమతుల ఆహారం), పోర్ట్ ఫైడ్ రైస్, నూనెలు , చక్కెరలు ,ఉప్పు వినియోగం గురించి పిల్లలు పెంపకంలో తండ్రులు కూడా బాధ్యత వహించాలని తెలిపారు. అనంతరం గ్రామంలో నిర్వహించిన ర్యాలీ, హ్యాండ్ వాష్ ప్రక్రియలు గురించి చేసి చూపించారు. కార్యక్రమంలో విజయవాహిని చారిటబుల్ ఫౌండేషన్ ప్రోగ్రామ్ అసోసియేట్లు పి.జగన్మోహన్, సీతంపేట ప్రోగ్రామ్ అసోసియేట్ అల్లు కృష్ణారావు, ఆశా వర్కర్ శివ కుమారి, ఎడబ్ల్యుడబ్ల్యు లక్ష్మీ, అన్నపూర్ణ పాల్గొన్నారు.

సైబర్ క్రైమ్‌పై అప్రమత్తం

ప్రజాశక్తి - కురుపాం

సైబర్ నేరాల బారిన పడకుండా మొబైల్ ఫోన్ వాడుతున్న ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని ఎస్సై పి.నారాయణరావు అన్నారు. మండలంలోని దురుబిలి గిరిజన గ్రామంలో ప్రజలకు సైబర్ క్రైమ్ నేరాలు బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. యువత చెడు వ్యసనాలు, మత్తు పదార్థాలకు బానిస కాకుండా జాగ్రత్తగా ఉంటూ ఉన్నత చదువులు చదువుకొని ఉన్నత స్థానంలో స్థిరపడాలని సూచించారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది గ్రామ ప్రజలు, యువత పాల్గొన్నారు.

ఆదాయం వచ్చే మార్గాలు వెతకాలి : ఎంపిపి

ప్రజాశక్తి - వీరఘట్టం

పంచాయతీలకు ఆదాయం వచ్చే మార్గాలు వెతకాలని ఎంపిపి డి.వెంకటరమణ నాయుడు సిబ్బందిని ఆదేశించారు. శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మండల స్థాయి శిక్షణ తరగతుల్లో ఆయన మాట్లాడారు. పంచాయతీలకు ఆదాయం వచ్చినప్పుడే ఆ గ్రామాలు అభివృద్ధి చెందుతాయన్నారు. ఆ దిశగా అధికారులు దృష్టి సారించి పంచాయితీలకు ఆదాయం వచ్చేలా చూడాలన్నారు. కార్యక్రమంలో ఎంపిడిఒ బి.వెంకటరమణ, సర్పంచులు, సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు.

బంగార్రాజు ఆశయ సాధనకు కృషి

ప్రజాశక్తి -గుమ్మలక్ష్మీపురం

సిపిఎం సీనియర్ నాయకులు, మాజీ సర్పంచ్ కిల్లక బంగారు రాజు ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని మండల నాయకులు పువ్వల తిరుపతిరావు పిలుపునిచ్చారు. మండలంలోని బీరుపాడు పంచాయతీ ఇజ్జకాయి గ్రామంలో కామ్రేడ్ బంగారు రాజు పదో వర్ధంతి సభ నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో ఏర్పాటు చేసిన ఆయన స్తూపం వద్ద పూలమాలలు వేసి నివాళ్లు అర్పించారు. గిరిజన సమస్యలపై పోరాడి ఆ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి ఎంతగానో కషి చేశారని అన్నారు. ఈ



బంగార్రాజు చిత్రపటంవద్ద నివాళ్లు అర్పిస్తున్న గిరిజనులు

ప్రజా రవాణా వ్యవస్థలో కీలకపాత్ర పోషిస్తున్న ఆర్‌టిసిలో పని ఒత్తిడి కండక్టర్లను ఉక్కిరిబిక్కిరి చేస్తోంది. ప్రతిరోజూ వేల సంఖ్యలో ప్రయాణికులను సురక్షిత ప్రాంతాలకు తరలించే డ్రైవర్లు, కండక్టర్ల ప్రాణాలకు రక్షణ లేకుండా పోతోంది. పని ఒత్తిడితో కూడుకున్న వీరి ఉద్యోగం నిత్యం సవాలుగా మారుతోంది. ప్రభుత్వ విధానాలు, అధికారుల వేధింపులు, ఒంటెద్దు పోకడలు వారిని ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి. ఆ ఒత్తిడే వారి ప్రాణాలను తీసేస్తోంది. తాజాగా ఉమ్మడి విజయనగరం జిల్లాలో విధి నిర్వహణలో ఉన్న ఇద్దరు కండక్టర్లు బస్సుల్లోనే గుండెపోటుతో మృతి చెందడం ఆర్‌టిసి ఉద్యోగులను కలవర పెడుతోంది.



ఆర్‌టిసిలో పని ఒత్తిడి

- కండక్టర్ల అకాల మరణాలు
- ఇప్పటికే ఇద్దరు మృతి
- ఓవర్ లోడ్.. టికెట్లు గందరగోళం
- 16 గంటల పాటు విధులు!
- దిక్కుతోచని స్థితిలో కుటుంబాలు
- అధికారుల ఒంటెద్దు పోకడలు

ప్రజాశక్తి-విజయనగరం కోట

విజయనగరం జిల్లాలోని విజయనగరం, ఎస్.కోట డిపోల పరిధిలో 245 మంది కండక్టర్లు, 213 మంది డ్రైవర్లు, పార్వతీపురం జిల్లాలో కండక్టర్లు 350 మంది, డ్రైవర్లు 4వందల మంది వరకు ఉన్నారు. రెస్టాఫ్ డ్యూటీలో ఉదయం 8గంటలకు డ్యూటీకి హాజరైతే రాత్రి 8గంటల వరకు పని చేయాలి. మరుచటి రోజు వీరికి సెలవు ఉంటుంది. ఎవరైనా డ్యూటీకి హాజరు కాకపోతే అదనంగా డ్యూటీ చేయాల్సి వస్తుంది. మరోరకమైన డ్యూటీలో ఉదయం 5గంటలకు డ్యూటీలో చేరితే మధ్యాహం 1గంటకు దిగుతారు. వీరు మరుచటి రోజు డ్యూటీకి హాజరు కావాల్సి ఉంటుంది. అయితే ఆర్‌టిసి అధికారులు ఒత్తిడి ఓ వైపు..బస్సుల్లో ప్రయాణికుల రద్దీ పెరగడం, తగినన్ని బస్సులు, సిబ్బంది లేకపోవడం మరోవైపు కండక్టర్లను, డ్రైవర్లకు ఒత్తిడికి గురిచేస్తున్నాయి. మహిళలకు ఉచిత ప్రయాణం వల్ల కండక్టర్లు మహిళలకు ఫ్రీ టికెట్, పురుషులకు డబ్బులు తీసుకుని టిక్కెట్లు ఇవ్వాల్సి వస్తోంది. ప్రయాణికుల రద్దీతో కొన్ని సందర్భాల్లో ఒకరి టిక్కెట్ మరొకరికి మారిపోవడం, అధికారుల తనిఖీల్లో రిమార్కులు రాసేయడంతో తీవ్రమైన ఒత్తిడికి గురవుతున్నారు. సస్పెన్షన్‌తో పాటుగా ఇంక్రిమెంట్లు పోవచ్చునని ఆవేదనకు గురవుతున్నారు. మరోవైపు ఎక్కువ టిక్కెట్లు కొడుతుండడంతో టిమ్స్ మిషన్లు ఛార్జింగ్ అయిపోయి ఇబ్బంది పడుతున్నారు. ప్రయాణికుల సంఖ్యకు అనుగుణంగా ఆర్‌టిసి సంస్థ బస్సులను పెంచకపోగా, ఉన్న బస్సుల్లో కోత పెట్టింది. ఆర్టీసీలో గత ప్రభుత్వం, నేటి కూటమి ప్రభుత్వం గాని సిబ్బంది నియామకాలు చేపట్టలేదు. ఉన్న సిబ్బందిలో కొంతమంది రిటైర్డ్ కాగా, మరికొంతమంది సిక్‌లో ఉంటున్నారు. దీంతో ఉన్న సిబ్బందికి సెలవులు దొరకని పరిస్థితి నెలకొంది. కండక్టర్లకు, డ్రైవర్లకు ఎటువంటి అనారోగ్య సమస్యలు వచ్చినా ప్రజా రవాణా అధికారులు సెలవులు మంజూరు చేయడం లేదు. ఫలితంగా అనారోగ్యం తోనే ఉద్యోగాలు చేయాల్సిన దుస్థితి నెలకొంది. ఈనేపథ్యంలోనే ఇటీవల ఇద్దరు కండక్టర్లు విధి నిర్వహణలోనే గుండెపోటుకు గురై మృతి చెందారు.

ఆరోగ్యం బాగోలేదని, సెలవు కావాలని సాలూరు డిపోకు చెందిన డి.దాసు అధికారులను అడిగారు. సెలవు ఇవ్వకపోవడంతో తప్పనిసరి పరిస్థితుల్లో విధులకు హాజరయ్యారు. సాలూరు నుంచి విశాఖ వెళ్తుండగా రామభద్రపురం చేరుకునేసరికి బస్సులోనే గుండెపోటుకు గురై కుప్పకూలిపోయారు. ఈనెల 4న సాలూరు నుంచి విశాఖ వెళ్తున్న బస్సు రామభద్రపురం ఆర్‌టిసి కాంప్లెక్సు చేరుకునే సమయంలో కండక్టర్ డి.దాసు సీట్లోనే కుప్పకూలి గుండెపోటుతో మరణించారు. తనకు ఆరోగ్యం బాగోలేదని, సెలవు కావాలని సాలూరు డిపోకు చెందిన డి.దాసు అధికారులను అడిగారు. సెలవు ఇవ్వకపోవడంతో తప్పనిసరి పరిస్థితుల్లో విధులకు హాజరయ్యారు. సాలూరు నుంచి విశాఖ వెళుతుండగా రామభద్రపురం చేరుకునేసరికి బస్సులోనే గుండెపోటుకు గురై కుప్పకూలిపోయారు. అలాగే గతనెల 23న ఎస్.కోట డిపోకు చెందిన ఈశ్వరరావు అనే కండక్టర్ విశాఖ నుంచి తిరుగు ప్రయాణంలో ఉండగా గుండెపోటుతో మృతి చెందారు. వీరిద్దరి మృతికి పని ఒత్తిడే కారణమని తెలుస్తోంది.

పని ఒత్తిడితో ప్రాణాలు పోతున్నాయి



ఉచిత బస్సు ప్రయాణంతో మహిళల సంఖ్య రెట్టింపు పెరిగింది. దీంతో బస్సుల్లో రెండు రకాల టిక్కెట్లు కొట్టడం, ఆ టిక్కెట్లు ఎక్కడ మారిపోతాయో అనే భయంతో కండక్టర్లు ఉన్నారు. 50 మంది ఎక్కాల్సిన బస్సులో వందమంది వరకు ఎక్కడంతో టికెట్లు కొట్టడం కూడా ఇబ్బంది అవుతుంది. బస్సు కదులుతుంటే ఈలోపు ఏదైనా స్టేజ్‌లో స్క్వాడ్ ఎక్కితే అప్పటికి టిక్కెట్లు కొట్టలేక పోతే కండక్టర్లలో టెన్షన్ పెరుగుతోంది. విపరీతమైన పని వత్తిడి, మానసిక ఆందోళన, ఉద్యోగ భద్రత లేకపోవడం వంటి భయంతో బస్ లోనే ప్రాణాలు పోతున్నాయి. మరిన్ని ప్రాణాలు పోకముందే అన్ని సంఘాలు, అసోసియేషన్‌లు ఈ విషయం లో ఐక్య కార్యాచరణ చేయాలి.

- వి.రాములు, ఆర్‌టిసి ఎస్‌డబ్ల్యుఎఫ్ జిల్లా కార్యదర్శి

పెరిగిన ఒత్తిడి

రాష్ట్ర ప్రభుత్వం స్త్రీశక్తి (ఉచిత బస్సు) పథకాన్ని ఆగస్టు 15 నుంచి అమలు చేస్తూ మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పించింది. దీంతో బస్సుల్లో ప్రయాణికుల సంఖ్య భారీగా పెరిగింది. స్త్రీశక్తి పథకం అమలు కాకముందు వరకు బస్సులో సగటున 50 నుంచి 60 మంది వరకు ప్రయాణించగా, నేడు 80 నుంచి 90 మంది వరకు ప్రయాణిస్తున్నారు. ఫలితంగా ఆర్‌టిసిలో కండక్టర్లపై విపరీతమైన పని భారం పెరిగింది. ఈ కారణంగా జిల్లాలో ఇటీవల ఇద్దరు ఆర్టీసీ కండక్టర్లు గుండెపోటుతో మరణించారు.

చిన్న తప్పులకు కూడా కేసులు బనాయింపు



స్త్రీ శక్తి పథకంతో బస్సుల్లో ప్రయాణికుల సంఖ్య పెట్టింపు అయ్యింది. టిమ్ ఛార్జీలు చాలక పోవడంతో ఆ బస్సును డ్యూటీ మధ్యలో ఆపలేక తీవ్రమైన ఒత్తిడి గురవుతున్నాం. దీనికి ప్రత్యేకమైన ఛార్జింగ్ మిషన్లు లేకపోవడంతో కండక్టర్లు ఏం చేయాలో పాల్పడక మానసికంగా ఒత్తిడి గురై ఇబ్బందులు పడుతున్నారు. స్క్వాడ్ చిన్న చిన్న తప్పులకు కూడా పాత విధానంగా కేసులు రాస్తున్నారు. ఇది ఉద్యోగుల్లో తీవ్రమైన ఒత్తిడికి గురై అకాల మరణానికి కారణమవుతున్నాయి. సిబ్బంది పట్ల అధికారుల ఏకపక్ష ధోరణి వీడాలి.

- పిజి రాఫెల్, ఎన్ఎంయు జిల్లా కార్యదర్శి

మద్యం దుకాణాల్లో అధికారుల తనిఖీలు

సీతానగరం: మండలంలోని ప్రైవేట్ మద్యం దుకాణాలను ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ పి.పద్మావతి తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లా అధికారుల ఆదేశాల మేరకు అన్ని ప్రైవేటు మద్యం దుకాణాలను తనిఖీలు నిర్వహించి ప్రభుత్వ నిబంధనను పాటిస్తున్నారా లేదా ప్రభుత్వం నిర్ణయించిన ఎమ్మార్పీ ధరలకు మద్యం అమ్మకాలు చేస్తున్నారో లేదని తెలుసుకుంటున్నామన్నారు. కార్యక్రమంలో ఎస్సై కె.మురళి, ఎక్సైజ్ సిబ్బంది పాల్గొన్నారు.

సుధాకర్ మృతికి డీలర్ల సంఘం సంతాపం

సీతానగరం: అప్పయ్య పేటకుచెందిన అంబటి సుధాకర్ గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన విషయం తెలిసినదే. శుక్రవారం రేషన్ డీలర్ల సంఘ నాయకులు రామా నాయుడు సుధాకర్ లక్షణరావు తో పాటు మరి కొంతమంది డీలర్లు మృతి చెందిన సుధాకర్ బౌతిక గాయానికి నివాళు లర్పించి అనంతరం దహన సంస్కరణ ఖర్చులు నిమిత్తం రూ. 5000 అందజేశారు

వర్షాలకు పాడైన ఏజెన్సీ రహదారులు

రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు

ప్రజాశక్తి -పాచిపెంట

ఇటీవల కురుస్తున్న ఎడతెరిపి లేని వర్షాలకు ఏజెన్సీలోని రోడ్లు పూర్తిగా దెబ్బతిన్నాయి. దీంతో ఆ ప్రాంత గిరిజనులు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ముఖ్యంగా కుడుమూరు నుంచి శతాభి, తంగలం, మూటకూడు, గరిశగుడ్డి, వేటగాని వలస వెళ్లే రహదారులు పూర్తిగా దెబ్బతిని పెద్దపెద్ద గుంతలుగా ఏర్పడడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని ఆదివాసీ గిరిజన సంఘం నాయకులు కొర్ర కళ్యాణ్ సుబ్బారావు, సేబి రామయ్య ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా శుక్రవారం రోడ్లపై ఉన్న గొయ్యిలను పరిశీలించారు. అనంతరం వారు మాట్లాడుతూ ఈ ప్రాంతానికి సచివాలయ ఉద్యోగులు, వేటగానివలస ఆశ్రమ పాఠశాలకు వెళ్లే ఉపాధ్యాయులు, కొండలపై గ్రామాలకు వెళ్లిన ఉపాధ్యాయులు, రోగులను తీసుకురావాలంటే తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న పరిస్థితి ఏర్పడుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. రాత్రి వేళల్లో నరకయాతన పడుతున్న పరిస్థితి ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు నిత్యం ఇలాగే తిరుగుతున్నా ఈ రహదారి విషయంపై ప్రత్యేక శ్రద్ధ చూపకపోవడం అనేక కష్టాలు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు కోరాడ ఈశ్వరరావు మాట్లాడుతూ. గిరిజన గ్రామాల రహదారుల పట్ల చిత్తశుద్ధితో ప్రభుత్వాలు వ్యవహరించాలని, ఈ ప్రాంత అభివృద్ధి పట్ల ప్రత్యేక దృష్టి పెట్టాలని కోరారు. ఈ సమస్యలపై గతంలో గ్రీవెన్స్‌లో పలుమార్లు వినతి పత్రాలు అందించినా పట్టించుకునే పరిస్థితి లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు, ఐటిడిఎ పిఒ ఈ రోడ్లను పరిశీలించి సమస్య పరిష్కారానికి కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో పలు గిరిజన గ్రామాల యువకులు పాల్గొన్నారు.



పాడైపోయిన రోడ్డును చూపుతున్న గిరిజనులు

గిరిజనాభివృద్ధికి పెద్ద పీట

ప్రజాశక్తి - సీతంపేట

గిరిజనాభివృద్ధికి కూటమి ప్రభుత్వం పెద్ద పీట వేస్తుందని పాలకొండ ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ అన్నారు. శుక్రవారం స్థానిక ఎపి గిరిజన సంక్షేమ బాలుర రెసిడెన్షియల్ స్కూల్‌లో మౌలిక వసతుల కల్పన నిమిత్తం రూ.167.50 లక్షలతో చేపట్టే పనులకు శంకుస్థాపన చేశారు. అదేవిధంగా సీతంపేట పంచాయతీ పరిధిలో గల తురాయిపువలస వద్ద గల హెచ్ఎన్‌టిసి ఫారం దగ్గర రూ.100లక్షలతో నిర్మించబోయే గిరిజన బహుళార్ధ సాధక మార్కెట్ సెంటర్లకు శంకుస్థాపన చేశారు. అనంతరం రూ.120 లక్షలతో దబర, గుడ్డిమీదగూడ నుంచి కుమ్మరగండి వరకు నిర్మించిన సిసి రోడ్డు కుమ్మరిగండిలో ప్రారంభించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ గిరిజన గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనలో కూటమి ప్రభుత్వం ముందడుగు వేస్తుందన్నారు. గిరిజనులకు అండగా ప్రభుత్వం ఉందన్నారు. కార్యక్రమంలో ఎఎంసి చైర్మన్ సంధ్యారాణి, కూటమి నాయకులు పవన్ ప్రసాద్, మండల జనసేన అధ్యక్షులు మండంగి విశ్వనాథం, మండల టిడిపి అధ్యక్షులు సవరతోట మొఖలింగం, ట్రైబల్ వెల్ఫేర్ ఇఇ పి.రమాదేవి, డిఇ నాగభూషణం పాల్గొన్నారు.

భామిని: స్థానిక ఏకలవ్య ప్రాంగణంలో రూ.360 లక్షలతో ఏకలవ్య సిబ్బంది కోసం నిర్మించబోయే అదనపు వసతి గృహానికి, నీలకంటేశ్వర స్వామి దేవాలయానికి రూ.120 లక్షలతో సీసీ రోడ్డు పనులకు పాలకొండ ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ స్థానిక సమస్యలను ఎప్పటికప్పుడు మంత్రుల దృష్టికి తీసుకువెళ్లి ఆ సమస్య పరిష్కారానికి క్షేత్రస్థాయిలో కృషి చేస్తున్నానని, దశలు వారీగా నియోజకవర్గంలో పలు సమస్యలను పరిష్కరిస్తున్నామన్నారు. ఈ సందర్భంగా అంబేద్కర్ గురుకులం సిఆర్‌టి ఉపాధ్యాయులు తమకు పర్మినెంట్ చేసి ఉద్యోగ భద్రత కల్పించాలని ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేశారు .కార్యక్రమంలో ఏకలవ్య ప్రిన్సిపల్ గంగాదేవి, మండల టిడిపి అధ్యక్షులు రవి నాయుడు, ప్రధాన కార్యదర్శి మేడిబోయిన జగదీశ్వరరావు, మాజీ ఎంపిపి భూపతి ఆనందరావు, స్థానిక సర్పంచ్ లోపింటి రాజేష్, టిడిపి నాయకులు బిడ్డకి ప్రసాద్, కృష్ణ చంద్ర దొర, కోరడా రాజేష్, కొల్ల మధు, కోరాడ వెంకటరమణ, గురుబిల్లి లక్ష్మీపతి వున్నారు.



రోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే జయకృష్ణ

సమస్యల పరిష్కారానికి విఆర్‌ఎల ధర్నా

ప్రజాశక్తి - పార్వతీపురంటౌన్

తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ శుక్రవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయం ఎదుట గ్రామ రెవెన్యూ సహాయకులు (విఆర్‌ఎ) సిఐటియు ఆధ్వర్యాన ధర్నా నిర్వహించారు. అనంతరం తహశీల్దార్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా కార్యదర్శి బివి రమణ, కోశాధికారి గొర్లి వెంకటరమణ మాట్లాడుతూ గ్రామాల్లో రెవెన్యూ సేవలు అందిస్తున్న గ్రామ రెవెన్యూ సహాయకుల పట్ల రాష్ట్ర ప్రభుత్వం తీవ్ర నిర్లక్ష్యం వహిస్తుందని తక్షణమే వీరికి కనీస వేతనాలు చెల్లించాలని, అర్హులైన విఆర్‌ఎ లను జూనియర్ అసిస్టెంట్లు, అటెండర్లుగా ప్రమోట్ చేయాలని డిమాండ్ చేశారు. ఇప్పటికే నామినీలుగా పనిచేస్తున్న వారిని రెగ్యులర్ విఆర్‌ఎలుగా నియమించాలని, మహిళా విఆర్‌ఎలకు ప్రసూతి సెలవులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ సమస్యలపై ఇప్పటికే మండల, జిల్లా, రాష్ట్ర స్థాయి అధికారులకు పలుమార్లు తెలియజేసినా ఎలాంటి స్పందనా లేదని ఇప్పటికైనా ఈ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. లేకుంటే జిల్లాలోని విఆర్‌ఎలందర్నీ ఐక్యం చేసి ఆందోళన చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో విఆర్‌ఎల సంఘం మండల అధ్యక్ష, కార్యదర్శులు టి.గోవింద, కె.లత, నాయకులు కృష్ణారావు, విద్యాసాగర్, కె నిర్మలలి తదితరులు పాల్గొన్నారు.



తహశీల్దార్‌కు వినతిని అందజేస్తున్న విఆర్‌ఎలు

విద్యార్థులకు దుప్పట్లు పంపిణీ

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

గుమ్మలక్ష్మీపురం, కొమరాడ మండలాల్లో 17 ఆశ్రమ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు 4410 దుప్పట్లు పంపిణీ చేస్తున్నట్లు గుమ్మ లక్ష్మీపురం ఎటిడబ్ల్యూ ఒ రజిని తెలిపారు. గుమ్మలక్ష్మీపురం 12, కొమరాడ 5 పాఠశాలలకు దుప్పట్లు అందించడం జరుగుతుందన్నారు. రానున్న చలికాలం దృష్టిలో ఉంచుకుని విద్యార్థులకు దుప్పట్లను ప్రభుత్వం అందిస్తోందని సద్వినియోగం చేసుకోవాలని ఆమె సూచించారు.

గోతులు కప్పకపోవడం దారుణం

ప్రజాశక్తి - కొమరాడ

పార్వతీపురం నుంచి కూనేరు వరకు గల అంతరాష్ట్ర రహదారిపై ఏర్పడిన గోతులను పూర్తి స్థాయిలో కప్పకపోవడం చాలా దారుణమని సిపిఎం నాయకులు కొల్లి సాంబమూర్తి అన్నారు. మండలంలో గల అంతర్‌రాష్ట్ర రహదారిపై ఏర్పడిన గోతులను శుక్రవారం పరిశీలించి ఆవేదన వ్యక్తం చేశారు. సంక్రాంతి కల్లా గోతులు పూర్తి చేస్తామని చెప్పినప్పుడు కూడా మళ్లీ సంక్రాంతి వస్తున్నా పార్వతీపురం నుంచి కూనేరు వరకు ఈ రోడ్డులో అడపా దడపా గోతులు కప్పారు తప్ప పూర్తిస్థాయిలో గోతులు కప్పని పరిస్థితి ఉందని అన్నారు. మూడు రాష్ట్రాలకెళ్లే రహదారి మార్గంలో పెద్దపెద్ద గొయ్యిలు ఏర్పడడంతో పాటు ఆ గొయ్యిల్లో నీరు చేరడం వల్ల ఇప్పటికే అనేక ప్రమాదాలు జరిగి అనేకమంది క్షతగాత్రులవ్వడమే కాకుండా, మృతి చెందిన పరిస్థితి ఉందన్నారు. గోతులు కప్పడానికి రూ.4కోట్లుకు పైగా టెండర్లు పిలిచామని, ఖరారైందని రోడ్లు భవనాల శాఖ అధికారులు పలుమార్లు చెప్పినప్పటికీ నేటికీ గోతులు కప్పే పరిస్థితి లేదన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి రోడ్డు మరమ్మతులు చేపట్టాలని, లేకుంటే పెద్ద ఎత్తున ఆందోళన చేపడుతామని హెచ్చరించారు.



అంతర్‌రాష్ట్ర రహదారి మధ్యలో ఏర్పడ్డ గొయ్యి

విద్యార్థుల మరణాలపై షర్మిలకు సమగ్ర నివేదిక

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

రాష్ట్ర కాంగ్రెస్ అధ్యక్షులు వైఎస్ షర్మిల దృష్టికి కురుపాం గురుకుల విద్యార్థులు అంజలి, కల్పన మృతికి గల కారణాలు, గురుకుల పాఠశాలలో నెలకొన్న అధ్వాన పరిస్థితులు, సిబ్బంది నిర్లక్ష్యం వంటి అంశాలపై సమగ్ర నివేదిక అందజేసినట్లు కురుపాం కాంగ్రెస్ కోఆర్డినేటర్ అడ్డాకుల చిన్నారావు తెలిపారు.

పలువురు కాంగ్రెస్‌లోకి చేరిక

వైఎస్ షర్మిల ఆధ్వర్యంలో ఏజెన్సీ ప్రాంతానికి చెందిన మీసాల ఫ్రాన్సిస్, తోయక జయరాం కాంగ్రెస్ పార్టీలోకి చేరారు. ఈ సందర్భంగా వీరికి షర్మిల కండువా వేసి పార్టీలోకి ఆహ్వానించారు. గుమ్మలక్ష్మీపురం, కురుపాం మండలాలకు నూతన అధ్యక్షులుగా ఎంపిక చేశారు. నియోజకవర్గంలో పార్టీ అభివృద్ధికి కష్టపడి పని చేయాలని సూచించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ అరకు పార్లమెంట్ అధ్యక్షులు శతాక బుల్లిబాబు, సాలూరు, పార్వతీపురం నియోజకవర్గాల కాంగ్రెస్ కోఆర్డినేటర్లు గేదెల రామకృష్ణ, బత్తిన మోహన్‌రావు ఉన్నారు.

గ్రామీణ బ్యాంకు సేవలకు అంతరాయం

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

ఎపిలో గ్రామీణ బ్యాంకుల విలీనం సందర్భంగా కోర్ బ్యాంకింగ్ సొల్యూషన్స్ అనుసంధానంలో భాగంగా జరిగే సాంకేతిక ప్రక్రియ కారణంగా ఈనెల 9 సాయంత్రం నుంచి 13 వరకు గ్రామీణ బ్యాంక్ సేవలు నిలిపివేస్తున్నట్లు బ్యాంకు మేనేజర్ చంద్రశేఖర్, బ్యాంకు మిత్ర పట్నాయకుని చైతన్య తెలిపారు. ఆర్థికపరమైన బ్యాంకింగ్ సేవలు ఆన్లైన్ లావాదేవీలు యుపిఐ మొబైల్ బ్యాంకింగ్ ఎటిఎం ఇంటర్నెట్ బ్యాంకింగ్ ఎఇపిఎస్ సేవలు అందుబాటులో ఉండవని తెలిపారు. ఖాతాదారులు ఈ అసౌకర్యాన్ని గుర్తించగలరని కోరారు.

విద్యుదాఘాతంతో బాలుడు మృతి

ప్రజాశక్తి - మక్కువ

ఎప్పటిలాగా ఆడుకుంటూ ప్రమాదవశాత్తు ఓ చిన్నారి విద్యుత్ షాకు గురై మృతి చెందిన ఘటన శుక్రవారం చోటు చేసుకుంది. స్థానికులు అందించిన సమాచారం మేరకు మండలంలోని ఎస్.పెద్దవలసకు చెందిన కోలుకోటి అఖీరా (4) ఎస్సీ కాలనీలో జామ చెట్టు వద్ద ఆడుకుంటుండగా పక్కనే ఉన్న స్థానిక సచివాలయం పరిధిలో గల వాటర్ ట్యాంక్ దగ్గర ఉన్న విద్యుత్ బోర్డు షాక్ కొట్టి చనిపోయినట్లు స్థానికులు అంటున్నారు. విషయం తెలుసుకున్న తల్లిదండ్రులు బోరున విలపిస్తున్నారు. ప్రమాదానికి గల కారణాలు పోలీసులు దర్యాప్తులో తెలియాల్సి ఉంది.



విద్యుత్‌షాక్‌కు గురైన అఖీరా

మాదలింగిలో 104 జిల్లా మేనేజర్ ఆకస్మిక తనిఖీ

ప్రజాశక్తి - కొమరాడ

104 వాహనంలో ఉండే వైద్య సదుపాయాలపై ప్రజలకు పూర్తిస్థాయిలో అవగాహన కల్పించాలని 104 జిల్లా మేనేజర్ ఎస్.కృష్ణ అన్నారు. మండలంలోని మాదలింగి పిహెచ్‌సిలో శుక్రవారం 104 వాహనాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసి, ప్రజలకు అందుతున్న వైద్య సేవలపై ఆరా తీశారు. వాహనంలో అన్ని రికార్డులు, మందుల లభ్యతను పరిశీలించారు. వాహనాన్ని తనీఖీ చేసి, పరిస్థితిని పరిశీలించి వాటి వివరాలను అడిగి తెలుసుకున్నారు. గ్రామాల్లో ప్రజలకు ఇంకా మెరుగైన వైద్య సేవలందించి, ప్రజలకు ఎటువంటి మందులు కొరత లేకుండా చూసుకోవాలని ఆదేశించారు. అలాగే వాహనాల కండిషన్‌ను ఎప్పటికప్పుడు పరిశీలించి, ఏదైనా మేజర్ సమస్యలుంటే తన దృష్టికి తీసుకొచ్చినట్లైయితే వెంటనే అవసరమైన సదుపాయాలు ఏర్పాటు చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో 104 సిబ్బంది ఉన్నారు.

పోస్టాఫీసులో సిబ్బంది కొరత

ప్రజాసేవలు జాప్యం

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

స్థానిక హెడ్ పోస్టాఫీస్‌లో సిబ్బంది కొరత కారణంగా ఆలస్యంగా సేవలు అందుతున్నాయి. దీంతో ప్రజలు గంటల తరబడి వేచి ఉండాల్సి వస్తుందని తెలిపారు. ఇక్కడ పోస్టల్ అసిస్టెంట్ ఒక్కరు మాత్రమే ఉండడంతో విధి నిర్వహణ భారంగా మారింది. గుమ్మలక్ష్మీపురం పోస్ట్ ఆఫీస్‌తో పాటు 22 బ్రాంచిల పనుల పరిశీలన ఒక్కరే చూడడంతో ఇబ్బందిగా మారింది. మరోవైపు పోస్టాఫీస్‌కు వస్తున్నా ఖాతాదారుల పనులు ఆలస్యం అవుతున్నాయి. ఆర్‌డి, ఎస్‌బి, ఆర్‌పిఎల్, పిఎల్ఐ, కెవిపి, ఎన్ఎస్‌సి సేవలు ప్రజలకు అందిస్తున్నారు. సకాలంలో మెరుగైన సేవలందించేందుకు మరొక పోస్టల్ అసిస్టెంట్‌ను నియమించే ఉన్నత అధికారులు చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

విద్యార్థులు మానసిక ఒత్తిడికి దూరంగా ఉండాలి

ప్రజాశక్తి - కురుపాం

విద్యార్థులు మానసిక ఒత్తిడికి దూరంగా ఉండాలని మన్యం జిల్లా కెరీర్, మానసిక ఆరోగ్య కౌన్సిలర్ రేవెళ్ల అనంతరావు అన్నారు. శుక్రవారం జియ్యమ్మవలస మండలంలో గల రావాడ రామభద్రపురం గిరిజన సంక్షేమ ఆశ్రమ ఉన్నత పాఠశాలలో ప్రపంచ మానసిక ఆరోగ్య వారోత్సవాలు కార్యక్రమంలో విద్యార్థులు మానసిక ఒత్తిడికి గురికాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు ముఖ్యంగా తల్లిదండ్రులు ఒత్తిడి వల్ల మానసిక ఒత్తిడికి గురవుతున్నారని అలా ఒత్తిడికి గురైన విద్యార్థులకు స్నేహితులు, ఉపాధ్యాయులు మీరు ఒంటరి కాదు మీకు మేమున్నామనే ధైర్యాన్ని ఇచ్చి ఒత్తిడి నుంచి దూరం చేయాలని సూచించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు తిరుపతిరావు సిబ్బంది పాల్గొన్నారు.